నేడు వాల్మీకి జయంతి

ఆల్విన్‌కాలనీ: వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో సీనియర్ నాయకుడు బోయ కిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరు కానున్నారు. ఎల్లమ్మబండలోని జన్మభూమి కాలనీలోని వాల్మీకి విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. స్థానికులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల ప్రమాణ స్వీకారం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన పి. నాగిరెడ్డి, ఆయన ప్యానెల్ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పూర్తి కమిటి సభ్యులను నాగిరెడ్డి నియమించారు. ఉపాధ్యక్షుడిగా బి.ఆర్. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా నరేష్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా డేవిడ్, రాంబాబు, వెంకటేష్, అడహక్ కమిటి సభ్యులుగా రత్నారావు, మూర్తి, పాషా, వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, పట్టాభిరెడ్డి, వెంకటరావు, శేషు గుప్త, నాగరాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు, మిగిలిన సమయంలో అభివృద్ధి కోసం పాటుపడతామని తెలిపారు. తాము గతంలో చేసిన అభివృద్ధి పనులే తమ విజయానికి దోహద పడ్డాయన్నారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

డీజీపీకి శుభాకాంక్షలు



మోతీనగర్: ఇటీవల నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన డీజీపీ బి. శివధర్ రెడ్డిని వీబీపీ మానవ హక్కుల సంఘం వ్యవస్థాపక డైరెక్టర్ ఎండి జహంగీర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంటెక్ సెకండ్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

బాలానగర్: జేఎన్‌టీయూ ఎంటెక్ సెకండ్ సెమిస్టర్ ఫలితాలను సోమవారం విడుదల చేశారు. 403 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 311 మంది ఉత్తీర్ణులైనట్లుగా పరీక్షల విభాగం డైరెక్టర్ జి. కృష్ణ మోహన్‌రావు తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.

శ్రీకాకుళం ప్రాంత వాసుల గౌరీ పూజ



మూసాపేట: మూసాపేటలోని పలు ప్రాంతాలలో సోమవారం రాత్రి గౌరీ పౌర్ణమి పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం ప్రాంత వాసులు దసరా తర్వాత గౌరీ పూజలు చేయటం ఆనవాయితీ. నగరానికి వలస వచ్చిన శ్రీకాకుళం ప్రాంత వాసులు చంద్రుడిని చూసి గౌరీ దేవికి కొత్త పంట, వరి, మొక్క, చెరుకు, పండ్లు, వివిధ రకాల నైవేద్యం సమర్పించి ఊ ఊ ఊ అంటూ వింత శబ్దం చేస్తూ పూజలు చేశారు. నగరానికి వలస వచ్చిన శ్రీకాకుళం ప్రాంత మహిళలు వారి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.

మత్తు.. బతుకు చిత్తు.!

అల్లాపూర్ డివిజన్‌లో మత్తుకు బానిసవుతున్న యువకులు

- మత్తులో ఊగుతూ దాడులకు దిగుతున్న వైనం
- పెట్రోలింగ్ పెంచి విక్రేతలపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం (ఫైల్)

మోతీనగర్: యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగం, కొత్తూరు సీతయ్యనగర్, పండిట్ నెహ్రూనగర్, ఆర్‌కే సొసైటీ, వి. రామారావు నగర్ శ్మశానవాటిక, బోరబండ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఇరువైపులా ఉన్న బహిరంగ ప్రదేశాల్లో, అదే విధంగా మూసాపేట డివిజన్ బబ్బుగూడ పశువుల సంత, అవంతినగర్ తోట కమాన్, భరత్‌నగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఇరువైపులా ఉన్న బహిరంగ ప్రదేశాల్లో గంజాయి విక్రయాలతో పాటు మత్తు పదార్థాలను విక్రయిస్తుంటారు.

- ఆయా ప్రదేశాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా యువత, సామాన్య ప్రజలు గంజాయి వంటి వాటిని కొని సేవిస్తూ ఉంటారు. ఎవరైనా ఇదేమిటని అడిగితే వారిపై దాడులు సైతం దిగుతున్నారు. గత సంవత్సరం దసరా పండుగ సమయంలో వి. రామారావు నగర్ శ్మశాన వాటిక సమీపంలో ఉదయం పూట గంజాయి సేవిస్తున్న యువకులు అటుగా వెళుతున్న సమీప కాలనీ వాసులపై దాడులకు సైతం ఎగబడ్డారు.
- అదే విధంగా హరి నగర్‌లో గత సంవత్సరం దాడులు సైతం చేశారు. వీటన్నిటికి కారణం గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో పాటు అక్రమ మద్యం విక్రయాలే కారణమని ఆయా కాలనీ వాసులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో విచ్చలవిడిగా మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు ఎక్కడ పడితే అక్కడ సంతలోని కూరగాయల్లాగా విక్రయిస్తున్నారు.
- అడపా దడపా ఎప్పుడో ఒకసారి పోలీసుల పెట్రోలింగ్ వాహనం వచ్చిన ప్పుడు మాత్రం ఎక్కడో ఒక చోట దాక్కుంటున్నారు. వారు కూడా సైరన్‌తో రావటంతో ముందుగానే వారు వచ్చారన్న సమాచారం పసిగట్టి విక్రయించే వారు, సేవించే వారు మాయమవుతారు.
- ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలోని పలు ప్రాంతాల్లో జోరుగా సాగుతున్న మత్తుపదార్థాల దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా బస్తీ, కాలనీ వాసులు కోరుతున్నారు.

కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి..



పోలీస్ అధికారులు కూడా నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి. గంజాయి దొరికే ప్రాంతాలపై నిఘా గట్టిగా పెట్టాలి. కళాశాల, పాఠశాలల్లో పోలీస్, ఇతర అధికారులు వారం వారం గంజాయి, మత్తుపదార్థాల విషయంలో అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కనిపెట్టుకుని ఉండాలని కోరారు.

– కార్పొరేటర్ సబిహా బేగం

గంజాయి విక్రయాలపై నిరంతర నిఘా



మేము గంజాయి తీసుకునే ప్రాంతాలపై నిఘా పెంచాం. పోలీస్ పెట్రోలింగ్ కూడా ఎక్కువగా చేస్తున్నాం. గంజాయి విక్రయించినా.. కొలుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఖాళీ ప్రదేశాల్లో, జన సంచారం లేని శ్మశాణవాటిక, పార్కులు, చెట్ల పొదలు, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో నిఘా పెంచుతాం.

– సామల వెంకటరెడ్డి, అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్

ఆంజనేయ స్వామి ఆలయ కమాన్ ప్రారంభం





కమాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ముఖద్వారాన్ని సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కమాన్ నిర్మాణానికి ఎమ్మెల్యే తన స్వంత నిధుల నుంచి రూ. 25 లక్షలు ఖర్చు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆధ్యాత్మిక అభివృద్ధిని, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటం తన కర్తవ్యమన్నారు. స్థానికులు, భక్తుల కోరిక మేరకు కమాన్‌ను నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు ఆవుల రవీందర్ రెడ్డి, సతీష్ గౌడ్, ఖాజా, సుధాకర్ రెడ్డి, ఎడ్ల ప్రభాకర్, శ్రీనివాస్,రాచందర్, ఎడ్ల సదానంద్, యాదయ్య, సూర్యనారాయణ, ఎడ్ల అశోక్, ఎర్ర మహేష్, మల్లారెడ్డి, పాశం కృష్ణ యాదవ్, ఎడ్ల శ్యాం, ఎడ్ల మనోజ్ కుమార్, స్థానిక భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ కమిషనర్‌పై ఫిర్యాదు



అదనపు కలెక్టర్ రాధికా గుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న ఆకుల సతీష్

నిజాంపేట్ : బాచుపల్లి కోమటికుంట చెరువులో వాసవి కన్‌స్ట్రక్షన్ సంస్థ ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌పై ఆకుల సతీష్ ఫిర్యాదు చేశారు. మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తాకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ చెరువులో 8,9 బ్లాకుల్లో నిర్మాణాలు చేపట్టిన వాసవి సంస్థపై గతంలోనే రెండు పోలీసు కేసులు నమోదయ్యాయన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల సంయుక్త సర్వేలో కూడా ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించారన్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం అక్రమ నిర్మాణాలను కూల్చివేసి చెరువును రక్షించాలని ఉత్తర్వులు ఉన్నా, హెచ్‌ఎండీఏ కమిషనర్ అందుకు విరుద్ధంగా వాసవి నిర్మాణాలకు అనుమతి ఇచ్చారని ఆరోపించారు. హెచ్‌ఎండీఏ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి, కోమటికుంట చెరువును రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా కమిషనర్, జిల్లా కలెక్టర్‌లను కోరారు. కార్యక్రమంలో అమలేశ్వరి, శ్రీనివాస్‌గౌడ్, అరుణ్‌రావు, కవితరెడ్డి, చందు, పాండు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బహుమతుల ప్రదానం..



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని రాంకీ పెరల్ కాలనీలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కన బరచి విజేతలుగా నిలిచిన చిన్నారులకు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారుల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీసి వారిలో పోటీతత్వం నెలకొల్పి చిన్నారులు ఎంచుకున్న రంగాలలో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు



ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట నూతన సీఐ వెంకటేశ్వర్లును సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మాచర్ల భద్రయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ నగర్ బస్తీ అధ్యక్షులు కొత్వాల్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 15 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలువురు సమస్యలపై జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ 5, ఇంజినీరింగ్ 9, ఎలక్ట్రికల్స్‌కు సంబంధించి 1 ఫిర్యాదు అందినట్లు అధికారులు తెలిపారు. ఆయా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు.

శర వేగంగా నల్ల చెరువు అభివృద్ధి పనులు





కూకట్‌పల్లి నల్ల చెరువులో కొనసాగుతున్న నిర్మాణ పనులు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నల్ల చెరువు అభివృద్ధి పనుల్లో హైడ్రా వేగం పెంచింది. ఇప్పటికే చెరువు విస్తీర్ణంతో పాటు బఫర్ జోన్లను తమ ఆధీనంలోకి తీసుకున్న హైడ్రా చెరువు భాగాన్ని పూర్తిగా తోడేసి నీటి నిల్వ ఉండే ప్రాంతాలను ఇప్పటికి తవ్వేశారు. ఇప్పటి వరకు చెరువు తూర్పు భాగంగా ఉన్న కట్ట బందోబస్తు కోసం రాతి నిర్మాణం చేపట్టారు. అదే విధంగా చెరువు చుట్టూ వాకింగ్‌ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇటీవలి కాలంలో వచ్చిన వర్షాలకు చెరువు నిండిపోయింది. అయితే చెరువులోకి పూర్తి స్థాయిలో డ్రైనేజీ నీరు రాకుండా మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు అన్ని శాఖల సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. చెరువు వాకింగ్ ట్రాక్ సమీపంలో క్రీడా ప్రాంగణంతో పాటు యోగా సెంటర్, బతుకమ్మ ఘాట్, మహిళలకు, పురుషులకు ప్రత్యేకమైన పార్కులను ఏర్పాటు చేయనున్నారు. పనులను డిసెంబర్‌కు ముందే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ నేపథ్యంలో సెలవు రోజుల్లోనూ జోరుగా పనులు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా చెరువు అభివృద్ధిలో భాగంగా ప్లాట్లు కోల్పోయిన వారికి హైడ్రా , ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని పట్టాదారులు వాపోతున్నారు. తమకు ప్రభుత్వం నుంచి కనీసం టీడీఆర్ సర్టిఫికెట్లను ఇప్పించాలని కొందరు డిమాండ్ చేస్తుండగా, మరి కొందరు కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

ఆంజనేయనగర్‌లో నాకాబందీ...



వాహన పత్రాలను పరిశీలిస్తున్న డీసీపీ సురేష్ కుమార్

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆంజనేయ నగర్‌లో బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. డీసీపీతో పాటు , ఏసీపీ రవికిరణ్ రెడ్డి నేతృత్వంలో 101 మంది పోలీస్ సిబ్బంది నాకా బందీలో పాల్గొన్నారు. సుమారు 1205 వాహనాలను తనిఖీ చేసి పత్రాలు లేకుండా ఉన్న వాహనాలు, తప్పుడు నెంబర్ ప్లేట్ ఉన్న వాహనాలు, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న వారిని వారి వాహనాలను పరిశీలించి కేసు నమోదు చేశారు. ద్విచక్ర వాహనాలు 68, మూడు చక్రాల వాహనం 1, నాలుగు చక్రాల వాహనాలు 4ను స్వాధీనం చేసుకున్నారు. మద్యం సేవించి వాహనం నడిపిన 11 మందిపై కేసులు నమోదు చేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

మోతీనగర్: ప్రజల కోరిక మేరకే అభివృద్ధి పనులు చేపడుతున్నామని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్ డి బ్లాక్‌లో కొనసాగుతున్న వాటర్ పైప్‌లైన్ పనులను ఆమె సోమవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అవసరమైన మౌలిక వసతులైన మంచినీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో డివిజన్‌లోని బస్తీ, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సఫ్దార్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి సలీం, తదితరులు పాల్గొన్నారు.

ఐడియల్ చెరువులో వ్యర్థాలను తొలగించాలి



ఐడియల్ చెరువులో పేరుకుపోయిన అమ్మవారి విగ్రహాలు, వ్యర్థాలు



చెరువు కట్టపై అమ్మవారి విగ్రహాలు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడియల్ రంగధాముని చెరువులో అమ్మవారి నిమజ్జనం తర్వాత అధికారులు వ్యర్థాలను తొలగించలేదు. చెరువులో వ్యర్థాలు అలాగే ఉండటంతో పాటు చెరువు కట్టపై కూడా చెల్లా చెదురుగా అమ్మవారి విగ్రహాలు, వ్యర్థాలు పడివున్నాయి. మూడు రోజులుగా ఐడియల్ చెరువు కట్ట వద్ద నిమజ్జనాలు చేపట్టారు. వాటిని ఎప్పటికప్పుడు తొలగించాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవటంతో చెరువు కట్టపై చెల్లా చెదురుగా పడి వున్నాయి. అంతేకాకుండా కొలనులో బతుకమ్మ వ్యర్థాలు, అమ్మవారి నిమజ్జన వ్యర్థాలతో, ప్లాస్టిక్ బాటిళ్లతో నిండిపోయింది. వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. వినాయక నవరాత్రుల్లో వ్యర్థాలను తొలగించినట్లుగానే ప్రస్తుతం కూడా వ్యర్థాలను తొలగించి చెరువు, కొలనును శుభ్రం చేయాలని భక్తులు కోరుతున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి



ఎల్‌జీ విస్టాలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి..

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ హన్మంత రెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధి ఎల్‌జీ విస్టాస్‌లో రూ.40 లక్షలు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల్లో అభివృద్ధి మందగించిదన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో నియోకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శివ కుమార్ గౌడ్, జిల్లా లేబర్ సెల్ ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి, మాజీ వార్డు మెంబెర్ కావాలి గోపాల్ ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, జైబెరి గోపాల్ రెడ్డి, అంజి ముదిరాజ్, నాగరాజు యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి కాలనీ అధ్యక్షుడు భాగ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


'బాకీ కార్డు' ఉద్యమంపై విస్తృత ప్రచారం



బాకీ కార్డు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

దుండిగల్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'బాకీ కార్డు ఉద్యమం'ను మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాలని నేతలు అన్నారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మల్లా రెడ్డి, మాధవరం కృష్ణారావు, కెపి వివేకానంద్, బండారి లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని బయటపెట్టడానికి బీఆర్‌ఎస్ పార్టీ 'బాకీ కార్డు' రూపంలో ప్రజల్లోకి వస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కామినేని ఆసుపత్రికి అవయవ దానం



నవీన్‌రావు (ఫైల్)

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, శేషాద్రినగర్‌కు చెందిన పాటిమీది శంకర్‌రావు కుమారుడు నవీన్‌రావు (42) బ్రెయిన్ డెడ్ కావటంతో అతడి అవయవాలను కామినేని ఆసుపత్రికి అందజేశారు. ఈ నెల 30న ఆయన భవనం మొదటి అంతస్తు నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం రెండు సార్లు ఆపరేషన్ చేసినా కోలుకోకపోవడంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆయన తల్లిదండ్రులు నవీన్‌రావు అవయవాలైన గుండె, కళ్లు, కిడ్నీ, లివర్‌ను కామినేని ఆసుపత్రికి అందజేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462